# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 327
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
అక్టోబర్ 13, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## మేమెంతో.. మాకంతా..

8లో..



- రిజర్వేషన్ అడ్డంకులపై రగులుతున్న బీసీలు
- ఓరుగల్లులో ఒక్కటవుతున్న మేధావులు, విద్యార్థులు, కుల సంఘాలు



## కొత్తకోట రచనలు సమాజంలో మార్పు కలిగిస్తాయి

- ఘనంగా 'పుంజు తోక' కవితా సంపుటి ఆవిష్కరణ సభ
- హాజరైన ప్రముఖ కవి అంపశయ్య నవీన్

తెలంగాణ సమాజానికి సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ గా సుపరిచితులైన విశ్రాంత ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఇప్పుడు రచయితగా, కవిగా సాహితీ లోకానికి పరిచయం కాబోతున్నారు. ఆయన రచించిన "పుంజు తోక" కవితా సంపుటి ద్వారా ఆయనలోని మరో కోణం ఆవిష్కృతమవుతోంది. విద్యార్థి దశ నుంచే కవిత్వం రాసిన అలవాటు ఉన్నప్పటికీ, వృత్తి పట్ల ఉన్న నిబద్ధతతో పోలీసు అధికారిగా పదవీ విరమణ చేసిన తర్వాతే తన అనుభవాలు, భావాలను అక్షర రూపంలోకి మార్చారు. శ్రీనివాస్ రెడ్డి తన రచనలకు శ్రీశ్రీ, చలం, కాళోజీ వంటి మహనీయులతో పాటు సినీ దర్శకులు సత్యజిత్ రే, నర్సింగరావు వంటి వారి నుంచి స్ఫూర్తి పొందానని చెబుతున్నారు. సాహిత్యం అనేది సంస్కారాన్ని అందించి, మానవ విలువలను కాపాడుతుందనే బలమైన విశ్వాసం ఆయనది. అందుకే ఆయన రచించిన "పుంజు తోక" కవితా సంపుటి సామాజిక స్ఫూర్తిని కలిగిస్తుందని ఆయన నొక్కి చెబుతున్నారు.( వివరాలు 8లో.. )

2లో..




## ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు

☐ శుభాకాంక్షలు తెలిపిన రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్

8లో..



## ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

- సర్దార్ పురుషోత్తం రావు పటేల్
- ఘనంగా మున్నూరు కాపుల ఆత్మీయ సమావేశం




వివరాలు2లో..

# 'చెత్త' గించండి.. సార్ !

- రోడ్డు పక్కనే చెత్తకుప్పలు
- గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- స్వాగతం పలుకుతున్న దుర్గంధం
- డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత డోర్నకల్ మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాలిటీగా అప్ గ్రేడ్ చేశారు. అందుకు తగ్గట్టుగానే జనాభాతో పాటు నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలూ విస్తరించాయి. అదే స్థాయిలో చెత్త సమస్యలు కూడా రెట్టింపయ్యాయి. అయితే అందుకు తగినట్లుగా డంపింగ్ యార్డులు లేకపోవడం ప్రధాన సమస్యగా పరిగణిస్తోంది. రోజు రోజుకూ పెరుగుతున్న చెత్తను ఎక్కడ డంపింగ్ చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. నిత్యం 100 టన్నులకు పైగా చెత్త సేకరణ జరుగుతున్నా డంపింగ్ యార్డ్ లేకపోవడంతో డోర్నకల్ - మహబూబాబాద్ ప్రధాన రహదారి సమీపంలోనే చెత్త డంపింగ్ చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రధాన రహదారి పక్కనే గుట్టలు, గుట్టలుగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తున్న చెత్తనుంచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. డోర్నకల్ కు వచ్చే వారికి దుర్గంధమే స్వాగతం పలుకుతోందంటున్నారు. ఇప్పటికైనా రోజు రోజుకూ పెద్ద మొత్తంలో వస్తున్న చెత్తను డంపింగ్ చేసేందుకు కావాల్సిన యార్డ్ ను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, డోర్నకల్



# 'చెత్త'గించండి.. సార్

- రోడ్డు పక్కనే చెత్తకుప్పలు
- గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- స్వాగతం పలుకుతున్న దుర్గంధం
- డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత డోర్నకల్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ గా రూపాంతరం చెందింది. జనాభాతో పాటు నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు విస్తరించాయి. అదే స్థాయిలో చెత్త ఉత్పత్తి పెరిగింది కానీ అందుకు తగ్గట్టుగా డంపింగ్ యార్డ్ లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఇది మున్సిపాలిటీ స్వచ్ఛతకు తూట్లు పొడుస్తోంది. 20 ఏళ్ల క్రితం 60 మెట్రిక్ టన్నుల లోపే చెత్త సేకరణ జరుగగా ప్రస్తుతం 100 మెట్రిక్ టన్నులకు పైగానే ఉత్పత్తి జరుగుతోంది. అయితే చెత్తను డంపింగ్ చేసేందుకు కావాల్సిన యార్డు స్థలం మాత్రం దొరకటం లేదు. ఈ సమస్య రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది.

## బైపాస్ రోడ్డులో డంపింగ్..

డోర్నకల్ ను మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేసినప్పటికీ కావాల్సిన డంపింగ్ యార్డ్ లేకపోవడం నగరం మురికి కూపంగా మారుతోంది. చెత్తను తరలించేందుకు కావాల్సిన డంపింగ్ యార్డ్ లేకపోవడంతో బైపాస్ రోడ్డే డంపింగ్ యార్డ్ గా మారుతోంది. పెద్ద ఎత్తున తీసుకొస్తున్న చెత్తను డోర్నకల్ – మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కనే డంపింగ్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో చెత్త, ఇతర వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి డోర్నకల్ పట్టణానికి చేరుకునే ప్రజలకు దుర్వాసన ముక్కు పుటాలదిరేలా చేస్తోంది. పట్టణానికంటే ముందే చెత్త కుప్పలు దర్శనమిచ్చి స్వాగతం పలుకుతున్నాయి. పట్టణ పరిధిలో డంపింగ్ యార్డు కోసం స్థలం దొరక్క ఇలా రోడ్డు వెంట చెత్తపోస్తున్నారని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, దాతలు స్పందించి స్థలం కెటాయించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణావాసులు కోరుతున్నారు.






# ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు

### ☐ శుభాకాంక్షలు తెలిపిన రిటైర్డ్ ఫ్రొఫెసర్ గడ్డం భాస్కర్

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తెలంగాణ తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు మండలంలోని గుడెప్పడ్ సెంటర్లో బాబుమియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అందరికీ అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాబు మియా మనవడు రెహమాన్, లక్ష్మారెడ్డి, ఎర్రన్న, మాచర్ల వెంకటేశ్వర్లు, మదర్ సాహెబ్, మునీరుద్దీన్, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సహృదయ వృద్ధాశ్రమంలో..

సిరికొండ మధుసూదనాచారి జన్మదినం సందర్భంగా హనుమకొండలోని సహృదయ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య గడ్డం భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా తాళ్లపల్లి రామస్వామి గౌడ్, సురేందర్, మునీరుద్దీన్, మదర్, అసిఫ్, సాయికుమార్, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడటానికి కావల్సిన ఆయురారోగ్యాలను ఆ భగవంతుడు సిరికొండకు కల్పించాలని వేడుకున్నారు.



# పచ్చదనంపై ముందడుగు

### ☐ పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్‌లో నాటిన 500 మొక్కలు

**వరంగల్ వాయిస్, దామెర :** పర్యావరణ పరిరక్షణ, పచ్చదన లక్ష్యంగా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఓగ్లాపూర్ (దామెర మండలం)లోని 400 కేవీ సబ్‌స్టేషన్‌లో సోమవారం భారీ వృక్షారోపణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 500 మొక్కలను నాటారు. ఈ పచ్చదన కార్యక్రమం జాతీయ స్థాయి పథకం "ఒక పేడ్ మా కే నామ్"లో భాగంగా జరిగింది. పవర్‌గ్రిడ్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు, భద్రతా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీజీఎం శ్రీ రాములు మాట్లాడుతూ "వృక్షాలు నాటడం అనేది పర్యావరణాన్ని కాపాడటానికి, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి అత్యంత సమర్థవంతమైన మార్గం. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ బాధ్యతపై శక్తివంతమైన సందేశాన్ని వ్యాప్తి చేయాలని" తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో, పర్యావరణంపై అవగాహన పెంపొందించడంలో పవర్‌గ్రిడ్ సంస్థ అంకితభావాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా తెలియజేసింది.





# కలెక్టరేట్ గ్రీవెన్స్ కు 80 ఫిర్యాదులు

### ☐ జీడబ్ల్యూఎంసీలో 70

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ సత్య శారద తో పాటు అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రామిరెడ్డిలు వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ గణపతి, ఆర్డీఓ ఉమారాణి, డీడబ్ల్యూఓ, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బల్దియాలో..

అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉంటూ గ్రీవెన్స్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కోరారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకార కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, సీహెచ్ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# స్వాగత తోరణానికి కొలతలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 36వ డివిజన్ పుప్పాల గుట్టలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయానికి రోజు రోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేస్తున్నట్లు ఆలయ చైర్మన్, సామాజికవేత్త ఎల్.శ్రీనివాస్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా స్వాగతం తోరణం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా శిల్పి, వాస్తు వేదాంతి ఏకాంబరం సోమవారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వాగత తోరణానికి కొలతలు వేశారు. త్వరలోనే స్వాగత తోరణం నిర్మించనున్నట్లు ఎల్.శ్రీనివాస్ వెల్లడించారు.

# పంటలకు తెగులు.. రైతులకు గుబులు

◆ వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** అకాల వర్షాలు, ఆకస్మిక వాతావరణ మార్పులు రైతులను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. వర్షాల కారణంగా వరి, పత్తి, కూరగాయల పంటలకు తెగుళ్లు ఆశించి పంటలు నాశనమవుతున్నాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రమం తప్పకుండా పడుతున్న వర్షాలతో వరి లో దోమ పోటు, అగ్గి తెగులు , పత్తి లో బూజు తెగులు, కాయ రాలి పోవడం జరుగుతుంది అని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో పంట చేతికి అందుతున్న తరుణంలో పంటలు తెగుళ్ల బారిన పడటంతో చివరికి పెట్టిన పెట్టుబడి కూడా రైతు కి దక్కేలా లేదు. వేల రూపాయలు ఖర్చు పెట్టి పురుగు మందులు పిచికారి చేస్తున్న వాతావరణ మార్పుల వల్ల పురుగు మందులు బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయని ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి తగు సూచనలు చేయాలని, ఇప్పటికే పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వాతావరణ మార్పులతో కూరగాయ తోటల్లో సైతం పూత రాలి దిగుబడి తగ్గి పోవడంతో కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

# డీసీసీ అధ్యక్ష పదవికి తౌటం రవీందర్ దరఖాస్తు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** టీపీసీసీ ఓబీసీ కో–ఆర్డినేటర్ తౌటం రవీందర్ హనుమకొండ డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) అధ్యక్ష స్థానానికి దరఖాస్తును సమర్పించారు. డీసీసీ భవన్‌లో దరఖాస్తులు స్వీకరించడానికి విచ్చేసిన ఏఐసీసీ అబ్జర్వర్ శ్రీ నవజ్యోతి పట్నాయక్ (ఒడిస్సా)ని ఆయన కలిసి దరఖాస్తును అందించారు. ఈ సందర్భంగా తౌటం రవీందర్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని అబ్జర్వర్‌కు వివరించారు. "1988 సంవత్సరంలో మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీలో నా ప్రస్థానాన్ని మొదలుపెట్టాను. ఆ తర్వాత మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా, డీసీసీ ప్రధాన కార్యదర్శిగా, డీసీసీ ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర ఓబీసీ సెల్ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ఓబీసీ కో–ఆర్డినేటర్‌గా నేటి వరకు నిస్వార్థంగా పనిచేశాను." "కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా 37 సంవత్సరాలుగా పార్టీని విడవకుండా, కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాను. కాంగ్రెస్ పార్టీనే ఊపిరిగా జీవిస్తూ, అనునిత్యం పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటున్న నా లాంటి వారిని గుర్తించి, ఆదరించాలని" ఆయన ఏఐసీసీ అబ్జర్వర్ కు విన్నవించుకున్నారు.

# ఘనంగా సిరికొండ మధుసూదనచారి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, గణపురం :** తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి, మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాజన్నల కుల సంఘం మేకల మండి వద్ద వర్షంలో సైతం కార్యకర్తలు, కులస్తులు పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజన్నల కులస్తులు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర తొలి స్పీకర్‌గా, భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేగా చారి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని కొనియాడారు. రానున్న రోజుల్లో మళ్లీ సిరికొండ మధుసూదనాచారిని భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డిపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మొగిలి శీను, రాయగట్టయ్య, కొమురయ్య, రాజయ్య, మల్లయ్య, అంజయ్య, జన్నే సుమన్, ఎడ్ల విద్వత్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాయకుల అభిప్రాయం మేరకే నూతన డీసీసీ అధ్యక్షుల ఎంపిక

ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీలో దేశవ్యాప్తంగా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్ ప్రకటించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'కాంగ్రెస్ సంఘటన్ శ్రీజన్ అభియాన్'లో భాగంగా, నూతన డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) అధ్యక్షుల ఎంపిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జిల్లా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అబ్జర్వర్లు దుర్గం భాస్కర్, మసూద్, రేణుక, కో–ఆర్డినేటర్ ఆదర్శ్ జైస్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నాయక్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ గుజరాత్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా మొదలుపెట్టిన ఈ నూతన ప్రక్రియ దేశవ్యాప్తంగా అమలు అవుతోందని తెలిపారు. హనుమకొండ జిల్లాలోని అన్ని మండల ముఖ్య నాయకులు,




మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు మరియు కార్యకర్తల సూచనలు, అభిప్రాయాలు కీలకం అని పేర్కొన్నారు. నూతన డీసీసీ అధ్యక్షుల నియామకంపై రానున్న ఎన్నికల బాధ్యత ఉంటుందని అన్నారు. అనంతరం నాయకులందరి అభిప్రాయాలను ఆయన స్వీకరించారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న గ్రామ, మండల, జిల్లా స్థాయి ఎన్నికల్లో పార్టీ విజయం కోసం క్షేత్ర స్థాయిలో కృషి అవసరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల నేపథ్యంలో 'బాకీ కార్డు' పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి కాంగ్రెస్ నాయకుడు 'దోఖా కార్డు' పేరుతో సరైన సమాధానం ఇవ్వాలని, 10 ఏళ్ల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రజలకు అవగాహన కల్పించాలని నాయిని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం కావ్య, కడియం శ్రీహరి, కే.ఆర్. నాగరాజు, ఇంచార్జి ఒడితల ప్రణవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్, ఈవీ శ్రీనివాస్ రావు, అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు, మహిళా అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

# పోలియో నిర్మూలనకు 'రెండు చుక్కలు'



**వరంగల్ వాయిస్, పరకాల :** పోలియో రహిత సమాజ నిర్మాణం దిశగా పరకాల పట్టణంలో 'నిండు జీవితానికి రెండు చుక్కలు' అనే నినాదంతో పోలియో చుక్కల కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక బస్టాండ్ ఆవరణలో వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 9వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి హాజరయ్యారు. తల్లిదండ్రులకు పోలియో చుక్కల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. "పుట్టిన మొదటి రోజు నుంచి ఐదేళ్ల వయస్సు వరకు ఉన్న ప్రతి ఒక్క పిల్లవాడు పోలియో చుక్కలు తప్పక వేయించుకోవాలి. ఇది మన సమాజాన్ని పోలియో రహితంగా మార్చే మార్గం. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఈ రెండు చుక్కలు అత్యంత కీలకం." ఈ సందర్భంగా, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, వాలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన కాకతీయుల నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయం, నవగ్రహ మండప ప్రతిష్ఠాపన మహోత్సవానికి సిద్ధమవుతోంది. సోమవారం ఆలయంలో అర్చకులు ముసునూరి నరేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ కార్తీక మాసంలో గణపతి శివలింగ సహిత నవగ్రహ అష్ట బలిపీఠాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఆలయంలో నూతనంగా నిర్మించిన నవగ్రహ మండపం ప్రతిష్ఠాపన కోసం ముస్తాబవుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా నిర్వహించే అన్నప్రసాద వితరణకు తాళ్లపల్లి కిరణ్మై, రాజన్న దంపతులు ముందుకు వచ్చారని గోవర్ధన్ గౌడ్ ప్రకటించారు. ఈ మహోత్సవాన్ని గ్రామ ప్రజలందరూ గ్రామ పండుగలా భావించి, తారతమ్యాలు లేకుండా పాల్గొని, ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 'సంఘతన్ శ్రీజన్ అభియాన్' విజయవంతం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలోని డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) కార్యాలయంలో సోమవారం 'సంఘతన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు హాజరయ్యారు. ఈ కీలక కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ కూడా పాల్గొని, సంస్థాగత నిర్మాణంపై నేతలతో కలిసి చర్చించారు. వివిధ నియోజకవర్గాల నుండి వచ్చిన కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 'సంగతన్ శ్రీజన్ అభియాన్' ద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించాలని నాయకులు నిర్ణయించారు.

# 14న 'డయల్ యువర్ డిపో మేనేజర్'



**వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి :** భూపాలపల్లి డిపో పరిధిలోని వివిధ మండలాల ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థుల సౌకర్యార్థం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డిపో మేనేజర్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భూపాలపల్లి డిపో మేనేజర్ ఆమంచ ఇందు తెలిపారు. ప్రజల రవాణా అవసరాలు, సంస్థ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వారి అమూల్యమైన సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు 9959226707 నంబర్‌కు డయల్ చేసి, సంస్థ అభివృద్ధికి సహకరించాలని డిపో మేనేజర్ ఈ సందర్భంగా సూచించారు.

# 'సంఘతన్ శ్రీజన్ అభియాన్' లో పరకాల కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన 'సంఘతన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేందర్ రెడ్డిని కలిసిన వారిలో పరకాల మూడవ వార్డు మాజీ కౌన్సిలర్ పోరండ్ల సంతోష్ ముఖ్యులుగా ఉన్నారు. ఆయనతో పాటు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోయ్యడ శ్రీనివాస్, సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ సంపత్ కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్-చైర్మెన్ డాక్టర్ మడికొండ శ్రీను, నాయకులు బొచ్చు భాస్కర్, ధార్న వేణు, గడ్డం శివ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను వక్రీకరించవద్దు

## ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు కామ్రేడ్ బీఎన్ పేరు పెట్టాలి

## ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ డిమాండ్




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** శ్రీరాం సాగర్ ప్రాజెక్టు రెండవ దశకు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ భీంరెడ్డి నరసింహారెడ్డి (బీ.ఎన్) పేరు పెట్టాలని ఎంసీపీఐ(యూ) (మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్)) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బి.ఎన్. గారు కీలక పాత్ర పోషించి, 'దున్నే వానికే భూమి' నినాదంతో లక్షలాది ఎకరాలను పేదలకు పంచారు. ఆయన మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీగా ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి కృషి చేశారు. ముఖ్యంగా గోదావరి జలాలను నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఎగువ ప్రాంతాలకు తరలించడం ద్వారా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలు ఎడారిగా మారకుండా రక్షించవచ్చని, ఇందుకోసం చట్టసభల్లో, ప్రజా క్షేత్రంలో పోరాడి 1996లో శంకుస్థాపన చేయించారని గుర్తు చేశారు. గోదావరి జలాలు సాధించే వరకు విరమణ లేదని చెప్పి, గోదావరి జలాల సాధనకే జీవితాన్ని అంకితం చేసిన బీఎన్ కృషికి నిజమైన నివాళి ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు ఆయన పేరు పెట్టడమే అవుతుందని సుధాకర్ అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మైదం శెట్టి రమేష్, తుడుం అనిల్ కుమార్, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఎత్తివేయాలి

- ఈ నెల 15న రాస్తారోకోలు
- బీసీ హక్కుల సాధన సమితి పిలుపు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. ఈ స్టేకు నిరసనగా ఈ నెల అక్టోబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సమితి పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు ప్రసంగిస్తూ... బీసీలు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లతో పాటు ఇతర హక్కులను సాధించేవరకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీ ఉద్యమాలకు సీపీఐ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. బీసీ హక్కుల సాధన సమితి కౌన్సిల్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హైకోర్టు స్టేను వెంటనే ఎత్తివేయాలని, కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 15న జిల్లా, మండల కేంద్రాలలో నిరసనలు, రాస్తారోఖోలు నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కలిసి వచ్చే సంఘాలన్నిటితో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయ నాయుడు, మాజీ ప్రధాన కార్యదర్శి రాయబండి పాండురంగ చారి, డీజీ సాయిలు గౌడ్, తాటి వెంకటేశ్వర్లు, శ్రావణ్ కుమార్, బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామి, బాపిరాజు, దీటి నరసయ్య, కళ్లెం కృష్ణ, విజయుడు, చీకటి ప్రకాష్, వెంకటేశం, శ్రీనివాస్, ప్రమీల, జెలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పత్తి పంటకు మద్దతు ధర దక్కేలా పరకాల వ్యవసాయ మార్కెట్‌లో వెంటనే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వరంగల్ ఉమ్మడి జిల్లా రైతు రక్షణ సమితి అధ్యక్షుడు వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. సోమవారం పరకాల వ్యవసాయ మార్కెట్‌లో అధికారులకు ఆయన ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. వరికెల కిషన్ రావు మాట్లాడుతూ... రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని పత్తి పంట పండించినప్పటికీ, పంట చేతికి వచ్చి 20 రోజులు అవుతున్నా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం పత్తికి మద్దతు ధర రూ. 8,110/- ఉండగా, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులకు రూ. 4 వేల నుంచి రూ. 5,500 వరకు విక్రయించి తీవ్రంగా మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం పెట్టుబడి డబ్బులైనా వస్తే చాలని రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు మోసపోకుండా ఉండేందుకు, ఎటువంటి షరతులు లేకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా పత్తి కొనుగోలు చేసే కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మికుల నాయకుడు లంక దాసరి అశోక్, రైతు నాయకులు సురావు బాపూరావు, సురావు కిషన్ రావు, కోడం రవీందర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో మేమున్నాం మిత్రమా

## బాధితుడికి పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** స్నేహబంధానికి, మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు హనుమకొండ జిల్లాకు చెందిన కొందరు పూర్వ విద్యార్థులు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ మిత్రుడికి "ఆపదలో మేమున్నాం మిత్రమా" అంటూ ఆర్థిక చేయూత అందించారు. శాయంపేట మండలం, పెద్దకోడెపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కు చెందిన రాజోజు రామచంద్రాచారి నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి దీనావస్థలో ఉండటంతో, విషయం తెలుసుకున్న తోటి మిత్రులందరూ స్పందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 40 వేలు సేకరించి, రామచంద్ర చారి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అని, స్నేహమంటే కేవలం ఆనందాలు పంచుకోవడమే కాదని, ఆపదలో ఆదుకోవడమని ఈ మిత్రులు నిరూపించారు. తమకు ఆర్థిక సహాయం చేసిన మిత్రులందరికీ రామచంద్ర చారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ గొప్ప కార్యక్రమంలో అన్న మహేందర్, బుస్స శ్రీనివాస్, ఏదుల మనోహర్, డి.సంజీవరావు, పైండ్ల శంకర్, ఐలి సురేందర్, కోకిల భిక్షపతి, కోగిల చంద్రమౌళి, బత్తుల వీరభద్రమ్ పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ మాసోత్సవాలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని కొత్తపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను టీచర్ ఉమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ జయప్రద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోషకాహారం ప్రాముఖ్యతపై సూపర్వైజర్ జయప్రద మాట్లాడుతూ ప్రతిరోజూ చిరుధాన్యాలు, స్థానికంగా దొరికే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పాలను సమపాళ్లలో భుజించాలని సూచించారు. దీని ద్వారా రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలంటే పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. పిల్లలు మొబైల్స్ వాడకుండా చూడాలని, వారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఆయన సూచించారు. గ్రామ సెక్రటరీ శ్రావణి మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతను పాటించడం వల్లనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ పోషణ మాసోత్సవాలలో భాగంగా ముగ్గురు గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. అలాగే, ఒక బాబుకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. టీచర్లు ఉమాదేవి, రజిత ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆహార వస్తువులతో కూడిన పోషకాహార ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శన చూసిన మహిళల్లో కొత్త వంటకాలు తయారు చేసుకోవడంపై అవగాహన పెరిగిందని, వారు సంతృప్తి వ్యక్తం చేశారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రజిత, ఉమాదేవి, ఏఎన్ఎం స్వరూప, స్కూలు ఉపాధ్యాయులు మనోహర్ తో పాటు ఎక్కువ సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## ◆ రేగొండలో ఘనంగా పోషణ మాసోత్సవాలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రేగొండ ఎమ్మార్వో శ్వేత రావు, జిల్లా సంక్షేమ అధికారిణి మల్లీశ్వరి అన్నారు. పోషణ్ మాసం (సెప్టెంబర్ 17 – అక్టోబర్ 16 వరకు) కార్యక్రమంలో భాగంగా, సోమవారం రేగొండ మండలంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ రేగొండ, కొడవటంచ సెక్టార్ల సూపర్వైజర్లు సంధ్య, సుజాత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మార్వో శ్వేత రావు, డీడబ్ల్యూఓ మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి కుటుంబం సరైన పోషకాహారం తీసుకోవడం ముఖ్యమని, గర్భిణీలు, చిన్నారులకు సరైన ఆహారం అందించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశాలు: గ్రామాల్లో పోషణ లోపం లేని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలను తయారు చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు చేశారు. బాల్య వివాహాలను అరికట్టాలని, ఇందుకోసం సఖి, అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. మహిళలు అనేక రంగాల్లో ముందుంటున్నప్పటికీ, ఎదురవుతున్న సమస్యలను అధిగమించి ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు తీసుకునే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

### ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ

### ప్రజలకు కార్పొరేటర్ మరుపల్ల రవి భరోసా



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** గత మూడు రోజులుగా నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్న 40వ డివిజన్ ప్రజల కోసం, మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. సోమవారం కరీమాబాద్‌లోని రామస్వామి గుడి ప్రక్కన గల ముస్లిం ఏరియాలో కార్పొరేటర్ మరుపల్లి రవి స్వయంగా వాటర్ ట్యాంక్‌ను తెప్పించి, పైపు ద్వారా ప్రజలకు నీటిని అందించారు. పైపులైన్ల ద్వారా నీటి పంపిణీకి అంతరాయం కలిగిన ప్రాంతాలలో ప్రజల కోరిక మేరకు బోరింగులు వేయడానికి మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయి దృష్టికి తీసుకువెళతానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అంతేకాక, డివిజన్‌లో ఏమైనా ఖరాబైన బోరింగ్‌లు ఉంటే, తమ దృష్టికి లేదా అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లయితే, సిబ్బందితో వెంటనే రిపేరు చేయిస్తామని ఆయన ప్రజలకు తెలియజేశారు.

# కోట గండి పెద్దమ్మతల్లి ఆలయానికి విరాళం



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని 44వ డివిజన్ పరిధిలోని సింగారం గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీశ్రీ కోట గండి పెద్దమ్మతల్లి దేవాలయానికి దర్వాజు (ద్వారం) నిర్మాణ నిమిత్తం భక్తులు తోడెం వెంకటయ్య (టీచర్) ముదిరాజు రూ. 25,016 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారి సన్నిధిలో దర్వాజు స్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముదిరాజు కుల పెద్దమనిషి ముత్యాల ఉప్పలయ్య దాతృత్వం చూపిన వెంకటయ్యని అభినందించారు. దేవాలయ ట్రస్ట్ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలుపుతూ, పెద్దమ్మతల్లి కృప ఆయన కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, ముదిరాజు సమాజ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాద కరంగా ఉన్నా పట్టించుకోరా!



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఆత్మకూరు మీదుగా వెళ్లే 163వ జాతీయ రహదారి ప్రస్తుతం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన విస్తారమైన వర్షాల కారణంగా రహదారి మొత్తం గుంతలమయంగా మారి, ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ గుంతలను పూడ్చకుండా వదిలేయడంతో, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. దీనికి తోడు, రాత్రిపూట స్ట్రీట్ లైట్లు కూడా వెలగకపోవడంతో వాహనాలు గుంతల్లో పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. దీంతో జాతీయ రహదారి వాహనదారులకు శాపంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారిపై ప్రయాణికుల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, గుంతలను వెంటనే పూడ్చి, వాహనదారులు క్షేమంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

# విద్యార్థులకు గ్రూప్ కెప్టెన్ జీ.జే. రావు నగదు పురస్కారాలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కార్గిల్ యుద్ధ వీరుడు, మాజీ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పీఆర్వో, గ్రూప్ కెప్టెన్ జీ.జే రావు తాను చదువుకున్న కాజీపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రేరేపించి, ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పదవ తరగతిలో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జి.జె. రావు తన సతీమణి పుష్పతో కలిసి పురస్కారాలు అందించారు. సైనిక సేవ నుంచి పదవీ విరమణ పొందిన తర్వాత జీ.జే. రావు తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేశారు. రైతులు, విద్యార్థుల ఆత్మహత్యల నివారణ కోసం ఆయన రచించిన పుస్తకాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఆవిష్కరించారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులు రేవంత్, యువరాజ్, హర్షవర్ధన్, వరప్రసాద్, దీపక్, గౌతమ్ సాయిలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జీ.జేరావుతో పాటు మాజీ విద్యార్థులు జయదేవ్, సుధాకర్ నగేష్, గుర్రపు సుధాకర్, స్కూల్ హెడ్ మాస్టర్ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీ.జే. రావు మాట్లాడుతూ పట్టుదల, స్వయంకృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు ఉద్బోధించారు. మాతృదేవో భవ, పితృ దేవో భవ, గురు దేవో బ్రహ్మ వంటి ఆచారాలను తప్పక పాటించాలని చెప్పారు. ముఖ్యంగా, మొబైల్ ఫోన్‌లకు బానిసలై ఆరోగ్యం, వ్యక్తిత్వాన్ని పాడుచేసుకోవద్దని హితవు పలికారు. హెడ్ మాస్టర్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ, విద్యార్థులు జి.జె. రావుని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి క్రీడలకు ఆర్డీఎఫ్ విద్యార్థులు ఎంపిక



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీలో నిర్వహించిన రాష్ట్ర ఎంపిక ట్రయల్స్‌లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ ట్రయల్స్‌లో మొత్తం 80 మంది పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఆర్డీఎఫ్ ఆర్చరీ అకడమీ విద్యార్థులు వివిధ వయో విభాగాల్లో అగ్రస్థానాలు సాధించారు. అండర్–19 విభాగంలో పి. వినయ్ (1వ ర్యాంక్), ఎం. అజయ్ (3వ ర్యాంక్), బి. కరుణాకర్ (4వ ర్యాంక్), అండర్–19 బాలికల విభాగంలో టింకీ (1వ ర్యాంక్) నిలిచారు. అండర్–17 బాలుర విభాగంలో బి. వినయ్ (1వ ర్యాంక్), అశ్విత్ (2వ ర్యాంక్), అవినాష్ (3వ ర్యాంక్), రామ్‌చరణ్ (4వ ర్యాంక్), అండర్–17 బాలికల విభాగంలో బి. మానస (1వ ర్యాంక్), పి. ఉషారాణి (2వ ర్యాంక్) ప్రతిభ కనబరిచారు. అండర్–14 బాలుర విభాగంలో బి. సిద్ధు (4వ ర్యాంక్), బాలికల విభాగంలో సహస్ర (1వ ర్యాంక్) నిలిచారు. అండర్–14 రికర్వ్ విభాగంలో సాత్విక్ (1వ ర్యాంక్), యమన్ (3వ ర్యాంక్), చేతన్ (4వ ర్యాంక్), అలాగే అండర్–17 రికర్వ్ విభాగంలో జగన్ (1వ ర్యాంక్), అభిరామ్ (2వ ర్యాంక్) ప్రతిభ కనబరిచారు. ఈ రాష్ట్ర ఎంపిక ట్రయల్స్ అక్టోబర్ 12, 2025న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య మరియు ఆర్డీఎఫ్ ప్రిన్సిపాల్ ఎ.జనార్ధన్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తయ్యాయి. విద్యార్థుల ప్రతిభను తీర్చిదిద్దడంలో ఆర్చరీ కోచ్ బండారి భరత్ కీలక పాత్ర పోషించారు. ఈ విజయంపై కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.

# అంకితభావంతో పనిచేసే వారికే డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా, అంకితభావంతో బలోపేతం చేసే నాయకులకే హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. సోమవారం హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో జిల్లా అధ్యక్ష ఎంపిక కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్ మండలాల వారీగా కాంగ్రెస్ నాయకులతో అధ్యక్ష ఎన్నిక గురించి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ "కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి, పారదర్శకంగా పార్టీ బలోపేతానికి కృషి చేసే వ్యక్తికి అధ్యక్ష పదవిని ఇవ్వాలి. పార్టీని ఏకతాటిపైకి తీసుకొచ్చి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని" ఆయన ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు వాసవి చంద్రప్రకాష్, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మారేపల్లి రవీందర్, చిట్టి రెడ్డి రాజిరెడ్డి, దుబాసి కృష్ణమూర్తి, వైనాల కుమారస్వామి, చిందం రవి, అబ్బు ప్రకాష్ రెడ్డి, డీటీ రెడ్డి, సాధు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి ఆర్థిక చేయూత

**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సోమవారం పట్టణంలోని ఓ పేద ముస్లిం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. 19వ వార్డుకు చెందిన అమీరున్ మనవరాలు వివాహం సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తమకు సహాయం చేసినందుకు అమీరున్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సొల్లు బాబు, 19వ వార్డు అధ్యక్షురాలు సొల్లు సునీత, గోస్కుల రాజ్ కుమార్, గాలిబ్ నరేష్, ఎండి ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూ మూడు కీలక ఎంఓయూలు

◆ న్యాస్కం, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్‌లతో ఒప్పందం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులలో అకాడమిక్ నైపుణ్యాలతో పాటు జీవన, వ్యక్తిత్వ నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో సోమవారం మూడు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందాలు విద్యారంగంలో విలువల ఆధారిత మార్గదర్శకత్వాన్ని స్థాపించడానికి మైలురాళ్లుగా నిలుస్తాయని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, న్యాస్కం సంస్థతో కేయూ ఒక సంవత్సరం కాలానికి అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, మరియు అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతలపై శిక్షణ ఇవ్వడం. విద్యార్థులు సర్టిఫికేషన్లు పొంది, దేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. కేయూ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది యొక్క మానసిక, ఆధ్యాత్మిక, సామాజిక, భావోద్వేగ అభివృద్ధికి తోడ్పడేలా హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒక సంవత్సరం ఒప్పందం కుదిరింది. జీవన నైపుణ్యాలు, విలువలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలతో పాటు ధ్యానం, యోగా, డీ–అడిక్షన్ శిక్షణలు ఉంటాయి. టీ–హబ్ ప్రతినిధులతో వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం జూమ్ సమావేశంలో పాల్గొన్నారు. టీ–హబ్,యు కేయూ మధ్య కుదరనున్న ఒప్పందంలో పొందుపర్చాల్సిన అంశాలు, విద్యార్థులకు అందించవలసిన నైపుణ్య శిక్షణలు, వాటి బాధ్యతలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, ఆచార్య జి.హనుమంత్, ఆచార్య టి.మనోహర్, డాక్టర్ భిక్షాలు, ఆచార్య మామిడాల ఇస్తారి, డాక్టర్ అనంత మాధవ మోహన్ (హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్) తదితరులు పాల్గొన్నారు.

## విలేకరికి వాక్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గుండె చికిత్స (స్టంట్) చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సాక్షి పత్రిక విలేకరి బుసరపు వెంకటేశ్వర్లు (వరంగల్ 39వ డివిజన్)కు వీఏకే సమైక్య ఫౌండేషన్ ద్వారా ఆర్థిక చేయూత లభించింది. వీఏకే ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ సోమవారం విలేకరి వెంకటేశ్వర్లుకు రూ. 12,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.డాక్టర్ వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన వీఏకే ఫౌండేషన్ గత 16 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో 600 పైచిలుకు కుటుంబాలకు నెలకు 10 కిలోల ఉచిత బియ్యం పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరాలు, ఆపరేషన్లు చేయించారు. అనాథ, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఉన్న పేదవారికి చికిత్స కోసం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కీర్తి వరంగల్ మండల అధ్యక్షులు తాళ్లపల్లి అర్జున్, కాశిబుగ్గ మండల అధ్యక్షులు అపురూప సాయి, బీజేపీ నాయకులు అంకాల జనార్దన్, ఇరుముల అరుణ్, దోమల భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పర్యవేక్షించాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, సీజనల్ వ్యాధుల నివారణ అంశాలపై జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ జిల్లా అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్ (స్థానిక సంస్థలు), బెన్ షాలోమ్ (రెవెన్యూ) ఈ సమావేశంలో పాల్గొన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పక్కాగా పర్యవేక్షించాలి. సీజనల్, వైరల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. ఫీవర్ సర్వే నిర్వహించి, వైద్య పరీక్షలు చేయాలని, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి, జాప్యం తగదని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీవోలు గోపి రామ్ (జనగామ), డీ.ఎస్. వెంకన్న (స్టేషన్ ఘనపూర్), డీఆర్‌డీఓ వసంత సహా పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎన్ఎం క్లబ్ టోర్నమెంట్‌లో కాజీపేట రైల్వే ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారుల హవా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లోని ఎస్ఎన్ఎం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన టోర్నమెంట్‌లో కాజీపేట రైల్వే ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను రైల్వే ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులే గెలుచుకోవడం విశేషం. ప్రథమ బహుమతి మహేందర్, శివ, ద్వితీయ బహుమతి ప్రవీణ్, కృష్ణ, తృతీయ బహుమతి వేణుగోపాల చారి, శ్రీకాంత్ లు గెలుపొందారు. విజయం సాధించిన క్రీడాకారులను రైల్వే ఆఫీసర్స్ క్లబ్, ఇతర క్రీడాభిమానులు ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మిలతో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి మొత్తం 41 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖాధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి, సమయానికి చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవి, ట్రైనీ ఉప కలెక్టర్ నవీన్ రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ స్పోర్ట్స్ మీట్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, సిబ్బందిలో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో అటవీశాఖ ఆధ్వర్యంలో 'కాళేశ్వరం జోన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025' ను ఘనంగా ప్రారంభించారు. కలెక్టర్ రాహుల్ శర్మ, సీసీఎఫ్ డా.ప్రభాకర్ రావు, ఎస్పీ కిరణ్ ఖరే జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ అటవీశాఖ సిబ్బందితో కలిసి వాలీబాల్ ఆడి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. ఈ జోన్ స్థాయి క్రీడా పోటీలలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, చెస్, క్యారం, బ్యాడ్మింటన్ వంటి క్రీడాంశాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఐదు జిల్లాల డీఎఫ్ఓలు, అటవీశాఖ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సిరికొండ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి 69వ జన్మదిన వేడుకలు సోమవారం వరంగల్ నగరంలో ఘనంగా జరిగాయి. వరంగల్ చౌరస్తాలో రాష్ట్ర విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ కార్యదర్శి మరియు రాష్ట్ర టీఆర్ఎస్ నాయకులు కర్ణ కంటి కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ ప్రధాన కార్యదర్శి సొల్లేటి కృష్ణమాచారి, ఆకోజు సురేంద్ర ఆచారి, హనుమకొండ స్వర్ణకార సంఘం కోశాధికారి శ్రీరామోజు సతీష్, వెంకటరమణ, రమేష్, సురేష్, అనిల్, రాజు, రమేష్, శ్రీనివాస్ ఆచారి, రాజేందర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.




### స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ తొలి శాసన సభాపతి, శాసన మండలి విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి 69వ జన్మదిన




వేడుకలను సోమవారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం, హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో, టీఆర్ఎస్ జిల్లా నాయకులు, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పానుగంటి శ్రీధర్ నేతృత్వంలో టైలర్ స్ట్రీట్‌లో కేక్ కోసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, రాష్ట్ర బులియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జక్కోజు కొటేశ్వరా చారి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ మాట్లాడుతూ... మధుసూదనాచారి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతి అభ్యుదయానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో సంఘాల నాయకులు వీణవంక సదానందం, కొత్త గట్టు బ్రహ్మం, శ్రీరామోజు సతీష్, ఆకోజు సురేందర్ రావు, సిద్దోజు వీరన్న, జక్కోజు సతీష్ పాల్గొన్నారు.

# ఇందులో ఒక్క ముద్దు సన్నివేశం లేదు




**తెలుసుకదా ట్రైలర్ విడుదలలో సిద్ధూ**

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన రొమాంటిక్ డ్రామా మూవీ 'తెలుసు కదా' రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో టీమ్ పంచుకున్న విశేషాలివి. సిద్ధూతో రొమాంటిక్ సినిమా తీయాలనే ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్నకు ఈ కాన్సెప్ట్‌కు సిద్ధూ అయితేనే న్యాయం చేయగలరని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం అని దర్శకురాలు నీరజ కోన అన్నారు. మొదట చూపిన ప్రచార చిత్రాలకు ఇప్పుడు రిలీజ్ చేసిన వాటికి సంబంధం లేనట్లు ఉంది? కావాలనే అలాంటి పోస్టర్స్ రిలీజ్ చేశారా? అని అడగ్గా కావాలని చేసింది కాదు. సినిమా ప్రారంభించినప్పటి నుంచి ప్రచార చిత్రాలు విడుదల చేస్తూ వచ్చాం అని సిద్ధూ అన్నారు. షూటింగ్ చేసే క్రమంలో కొన్ని మార్పులు చేశాం. అందుకే అలా డిఫరెంట్‌గా ఉన్నాయి. ట్రైలర్‌తో కథను చెప్పాలని అనుకున్నాం. దీపావళికి పోటీ చాలా ఉంది. ఆ సమయంలోనే విడుదల చేయడం రిస్క్ అనిపించడం లేదా? అంటే.. రిస్క్ ఉన్నచోటే విజయం ఉంటుంది. నా గత చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఒక సినిమా నన్ను కింద పడేస్తే.. మరొకటి టాప్‌లో చేర్చుతుందని నమ్ముతాను. ఈ సినిమాలో పాత్ర 'టిల్లు' పాత్రను పోలి ఉందా? అని అంటే...దానికి, దీనికి సంబంధం ఉండదు. ఇందులో దానికి మించిన వినోదం ఉంటుందన్నారు. ఎప్పుడూ ఇద్దరు హీరోయిన్లతో మూవీ చేస్తున్నారని ఎందుకని అడిగితే...నేను ఇప్పటివరకూ ఇద్దరు హీరోయిన్లతో చేసింది ఒకే సినిమా 'కృష్ణా అండ్ హిజ్ లేడీ'. దానిలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు. 'టిల్లు స్క్వేర్'లో అతిథి పాత్రలో మరో హీరోయిన్ ఉన్నారంతే. లవ్ స్టోరీ కాబట్టి దానికి తగినట్లే తెరకెక్కించారు. ఇందులో ముద్దు సన్నివేశాలు లేవు. ఒక్క ముద్దు సీన్ కూడా ఉండకూడదు అని కథ చెప్పినప్పుడే నీరజకు కండీషన్ పెట్టా. ఇది ఫ్యామిలీ మూవీ. ఇద్దరు హీరోయిన్లు, దర్శకురాలు, నిర్మాత.. అందరూ మహిళలే.. వాళ్లందరితో వర్క్ చేయడం సరదాగా అనిపించింది. రాశీ ఖన్నా అయితే క్లైమాక్స్‌లో నేను చేయను అని 40 నిమిషాలు సెట్ నుంచి వెళ్లిపోయింది. 'నా బాయ్‌ఫ్రెండ్ ఇలా చేస్తే నేను అంగీకరించను' అని పక్కకి వెళ్లి కూర్చొంది. ఇది కేవలం పాత్ర అని చెప్పి తీసుకొచ్చాను. సెట్‌లో 16 మంది మహిళలు ఉండేవారు. వాళ్లందరిలో నేను ఒక్కడినే ఉండేవాడిని. ఇకపోతే సినిమా అన్నాక.. డబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి.. నాకు రికవరీ అనేది ఎమోషనల్‌గా కావాలి. ఫైనాన్షియల్‌గా కాదు. రవితేజతో గతంలో ఒక సినిమా ఎ□`లాన్ చేశాం. కానీ, అది ఆగిపోయింది. ఒకవేళ మా ఇద్దరికీ సరిపోయే కథ ఉంటే కచ్చితంగా చేస్తాం అని సిద్ధూ అన్నారు.



# రీమేక్ కానున్న సంక్రాంతికి వస్తున్నాం

తెలుగు బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ కానుందంటూ నెట్టింట పలు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో అనీల్ రావిపూడి తెరకెకక్కించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం గత సంక్రాంతి 2025 సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది . దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఈ క్రమంలో చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. బాలీవుడ్ రీమేక్ స్టార్ అక్షయ్ కుమార్‌తో సంప్రదింపులు కూడా చేస్తున్నట్టు టాక్ నడుస్తుంది. అక్షయ్ కుమార్ ఇప్పటికే 'భూల్ భులయ్యా 2', 'రౌడీ రాథోర్', 'లక్ష్మీ' వంటి దక్షిణాది రీమేక్‌లతో హిట్ ట్రాక్‌లో ఉన్నారు. అయితే ఇటీవల వరుస ఫ్లాపులతో అక్షయ్ కుమార్ కెరీర్ ఒడిదుడుకుల్లో సాగుతోంది. ఈ సమయంలో ఆయన మళ్లీ సౌత్ ఇండస్ట్రీ సూపర్ హిట్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి కథను ఎంచుకుంటే సేఫ్ జోన్‌లో పడతాడని విశ్లేషకులు కూడా అంటున్నారు.
బాలీవుడ్ ట్రేడ్ వర్గాల ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఈ సినిమాను హిందీలో నిర్మించేందుకు బాలీవుడ్ మేకర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం . వెంకటేష్ చేసిన పాత్రకు అక్షయ్ కుమార్ సరైన ఎంపిక అని చాలా మంది భావిస్తున్నారు. తెలుగులో ఈ సినిమా విజయానికి కథ కంటే కూడా వెంకటేష్ టైమింగ్, కామెడీ టచ్, అనిల్ రావిపూడి మేకింగ్ ప్రధాన కారణాలుగా నిలిచాయి. అయితే బాలీవుడ్ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కథ, స్క్రీన్‌ప్లేలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటివి లేకపోతే , ఈ సినిమా డిజాస్టర్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్ల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





# మనీశ్ మల్హోత్రా ఇంట్లో దీపావళి వేడుకలు

**సినీ ప్రముఖులతో పాటు నీతా అంబానీ హాజరు**

భారతీయులు అత్యంత ఘనంగా జరుపుకునే పండగల్లో దీపావళి ఒకటి. ప్రస్తుతం ఈ పండగకి వారం రోజులే సమయం ఉండటంతో దేశవ్యాప్తంగా సంబరాలు మొదలయ్యాయి. ప్రజలు తమ ఇళ్లను అందంగా అలంకరించుకోవడం ప్రారంభించేశారు. వెలుగుల పండగను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఇక బాలీవుడ్ ఇండస్ట్రీలో దీపావళి సందడి వారం ముందే వచ్చేసింది. తారలు పార్టీలంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్రా తన ఇంట్లో.. స్నేహితులు, కుటుంబ సభ్యులకు దివాళి పార్టీ ఇచ్చారు. ఈ పార్టీకి పలువురు బీటౌన్ తారలు హాజరై సందడి చేశారు. కరీనా కపూర్ , హేమ మాలినీ, జెనీలియా, కరణ్ జోహార్, రేఖ, ప్రీతి జింటా, అనన్య పాండే, కృతి సనన్, కాజోల్, అదితిరావ్ హైదరి, వాణీ కపూర్, సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్, మలైకా అరోరా, సారా అలీఖాన్, ఖుషీ కపూర్, సుహానా ఖాన్ తదితరులు పార్టీకి హాజరయ్యారు. భారత్‌లోనే అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ కుటుంబం కూడా ఈ పార్టీలో మెరిసింది. నీతా అంబానీ, రాధిక మర్చంట్ దివాళీ పార్టీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక దుస్తుల్లో అందరినీ ఆకర్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# ఆనంద్ దేవరకొండ..

## తక్షకుడు

బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ప్లిక్స్ ఒరిజినల్ సీరిస్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి. థియేటర్‌తో పాటు ఓటీటీలో విడుదలైన సినిమాలు కూడా ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఓటీటీ ట్రెండ్‌ను ఫాలో అవుతూ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇలా యాక్షన్ ఫిల్మ్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'తక్షకుడు'. నెట్‌ప్లిక్స్ వేదికగా విడుదల కానుంది. వినోద్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు..' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిరచనున్నారు.



# కొత్తకోట రచనలు సమాజంలో మార్పు కలిగిస్తాయి

- ఘనంగా 'పుంజు తోక' కవితా సంపుటి ఆవిష్కరణ సభ
- హాజరైన ప్రముఖ కవి అంపశయ్య నవీన్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విశ్రాంత ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి రచించిన 'పుంజు తోక' కవితా సంపుటి ఆవిష్కరణ సభ హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం అంపశయ్య నవీన్ చేతుల మీదుగా 'పుంజు తోక' సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అంపశయ్య నవీన్ మాట్లాడుతూ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి రచనలు సామాజికంగా మార్పును తీసుకువచ్చే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. 'పుంజు తోక' సంపుటిలోని కవితలు సామాజిక స్ఫూర్తిని కలిగిస్తున్నాయని, ఆయన రచనలు అభ్యుదయ భావాలు కలిగి ఉన్నందున శ్రీనివాస్ రెడ్డిని అభ్యుదయ కవిగా భావిస్తున్నానని నవీన్ పేర్కొన్నారు. 'పుంజు తోక' సంపుటిలో నవరసాలు ఒట్టిపడ్డాయని, పోలీసుల సేవను, వారి త్యాగాలను చులకనగా చూడవద్దని రచయిత చక్కగా వివరించారని నవీన్ తెలిపారు. సమాజంలోని అమానవీయ సంఘటనలపై చలించి, స్పందించే మనస్సు ఉన్నవారే కవిత్వం రాయగలరని, భవిష్యత్తులో కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ద్వారా మరిన్ని అభ్యుదయ రచనలు రావాలని ఆయన ఆకాంక్షించారు.

**వరంగల్‌తో ప్రత్యేక అనుబంధం..**

తన రచనల గురించి విశ్రాంత ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్‌తో తనకు ప్రత్యేక అనుభూతి ఉందని, ఇక్కడ ట్రైనింగ్ ఏఎస్పీగా, తర్వాత ఎస్పీగా పనిచేసే భాగ్యం లభించిందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే కవిత్వం రాసే అలవాటు ఉందని, పోలీస్ అధికారి అయ్యాక తన అనుభవాలను పుస్తక రూపంలోకి మార్చుకున్నానని చెప్పారు. ఈ పుస్తక రచనలో శ్రీశ్రీ, చలం, కాళోజీ వంటి కవులతో పాటు సినీ దర్శకులు సత్యజిత్ రే, నర్సింగరావు వంటి ప్రముఖులు తనకు స్ఫూర్తినిచ్చారని ఆయన వివరించారు. సాహిత్యం అనేది సంస్కారాన్ని అందించి, మానవ విలువలను కాపాడుతుందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ముందుగా ఆచార్య బన్న అయిలయ్య, నాగిళ్ళ రామశాస్త్రి, వి.ఆర్. విద్యార్థిలు 'పుంజు తోక' సంపుటిలోని కవితలపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారు. చివరగా, వరంగల్ సాహిత్యవేత్త మల్యాల మనోహర్ రావు ముగింపు ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రై-సిటీకి చెందిన సాహిత్యవేత్తలు, పోలీస్ అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# మేమెంతో.. మాకంతా..


- రిజర్వేషన్ అడ్డంకులపై రగులుతున్న బీసీలు
- ఓరుగల్లులో ఒక్కటవుతున్న మేధావులు, విద్యార్థులు, కుల సంఘాలు

**వరంగల్ వాయిస్, రాంనగర్ :** ఉద్యమాల పురిటి గడ్డ, ఉత్తర తెలంగాణ కేంద్రంగా బీసీ ఉద్యమం రగులుకుంటోంది. 42శాతం రిజర్వేషన్ పట్ల ప్రధాన రాజకీయ పార్టీలు, రెడ్డి జాగృతి లాంటి అగ్రవర్ణ సంస్థలు అనుసరిస్తున్న విధానాలపై బీసీ సంఘాలు, మేధావుల, విద్యార్థులు సంఘటితంగా గొంతెత్తారు. ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ యాదవ్ నేతృత్వంలో, ఆయన అధ్యక్షతన హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ సామాజిక సంస్థలు, కుల సంఘాలు, మేధావి వర్గం పలు కీలక తీర్మాణాలు చేశారు. తెలంగాణ సాధన కోసం సబ్బండ వర్గాలు ఏ రకంగా కదిలాయో అదే తీరులో బీసీ రాజ్యాధికారం కోసం మరో ఉద్యమం సామాజిక తెలంగాణ కోసం ఆవిర్భవించాలని సమావేశం ఏక కంఠంతో ప్రకటించింది... తెలంగాణ సాధన కోసం సమరం సాగించిన బలహీన వర్గాల ప్రజలు ప్రస్తుతం తమ కోసం తాము ఉద్యమం చేయాల్సిన చారిత్రక అవసరం ఉత్పన్నమైందని మేధావులు అభిప్రాయ పడ్డారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ విజయ లక్ష్మీ, కోశాధికారి రాజేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ వేణుమాధవ్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బీసీ మహసేన రాష్ట్ర కన్వీనర్ తడిశెట్టి క్రాంతి కుమార్, ముదిరాజ్ నాయకులు పులి రజనీకాంత్ , ప్రొఫెసర్ సీహెచ్ రాములు, కమల్ కుమార్, బెనర్జీ, అఖిలభారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య యాదవ్, కాపు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకయ్య, వైద్యం రాజగోపాల్, బీసీ మహసేన కో-కన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి, అడ్వకేట్ సర్జు మోహన్, ఓబీసీ యూత్ నాయకులు మౌనిక గౌడ్, ఆరె క్షత్రియ నాయకులు మనోహర్ రావు, భిక్షపతి, శ్రీధర్ రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

- సర్దార్ పురుషోత్తం రావు పటేల్
- ఘనంగా మున్నూరు కాపుల ఆత్మీయ సమావేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మున్నూరు కాపులు ఐక్యంగా బహుజనుల సహకారంతో రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ అన్నారు. వరంగల్‌లోని వజ్రా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ మున్నూరు కాపుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ కుల చరిత్రలో కొండా మురళి చరిత్ర ఒక అధ్యాయం అని, ఆయనను మున్నూరు కాపులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, దాస్యం ప్రణయ్ భాస్కర్, వినయ్ భాస్కర్, నన్నపనేని నరేందర్ వంటి నాయకుల సేవలను ఎప్పటికీ మరువకూడదని గుర్తుచేశారు. ఈ నాయకుల గౌరవాన్ని కాపాడుతూ, ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. పురుషోత్తం రావు పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మున్నూరు కాపు కుటుంబ సభ్యులందరూ తప్పకుండా లైఫ్ మెంబర్‌షిప్ తీసుకోవాలని కోరారు. దీని వల్ల భవిష్యత్తులో సంఘం ఏర్పాటు చేసే మున్నూరు కాపు ఆసుపత్రులలో సభ్యులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని వివరించారు. అందరి సూచనలు, సలహాలు తీసుకొని కులాన్ని ఐక్యం చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అపెక్స్ కన్వీనర్ మీసాల చంద్రయ్య పటేల్ మాట్లాడుతూ 'ఒకే కులం-ఒకే సంఘం' నినాదంతో సంఘం స్థాపించబడిందని, సంఘ నిర్మాణంలో తాను కీలకపాత్ర వహిస్తానని హామీ ఇచ్చారు. ఒక సంవత్సరంలోగా తెలంగాణ రాష్ట్ర సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానని, సభ్యత్వాలు పూర్తయిన తర్వాత మూడు లక్షల మందితో హైదరాబాద్‌లో 'మున్నూరు కాపు గర్జన' నిర్వహిస్తానని ప్రకటించారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు నీలం రాజు కిషోర్ మాట్లాడుతూ, మెంబర్‌షిప్ డ్రైవ్ వివరాలను యాప్‌లో పొందుపరిచి, అందులో డాక్టర్లు, లాయర్లు వంటి వివిధ వృత్తుల వారి వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంఘం కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. మున్నూరు కాపులు బీసీలు కాదంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర కార్యవర్గం ఆదిలోనే అరికట్టాలని కోరారు. పెద్దలు పుంజాల శివశంకర్ మున్నూరు కాపులను బీసీలలో చేర్చిన మేలును కాపాడుకోవాలని సూచించారు. గడ్డం రమేష్ మాట్లాడుతూ కులం చరిత్రను అధ్యయనం చేసి భవిష్యత్ తరాలకు అందించాలని, నిజాంల కాలం నుంచి మున్నూరు కాపులకు జరిగిన నష్టాన్ని, వలసలను గుర్తుచేస్తూ, ఐక్యతతో తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అపెక్స్ కమిటీ సభ్యులు, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు, కుల పెద్దలు ఈవి శ్రీనివాస్, మంద ఐలయ్య, తోట వెంకటేశ్వర్లు, కొరోబోయిన సాంబయ్య, కందుల సృజన్ కాంత్, కామిశెట్టి కోటేశ్వరమ్మ, బొజ్జం రమేష్, పోతు కుమార స్వామి, కనుకుంట్ల రవి కుమార్, పెండేల సంపత్, పోగుల సారంగపాణి, తోట తిరుపతయ్య, నల్లెల సురేందర్, గడ్డం రమేష్, పెంచాల గోపన్న, పాటి శ్రీనివాస్, ఇట్యాల హరికృష్ణ పటేల్, పొనగంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం రావు పటేల్, అపెక్స్ కన్వీనర్ మీసాల చంద్రయ్య పటేల్‌ను ఘనంగా సన్మానించారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com